# ఆమె కిచ్చిన ప్రేమ లేఖ



— యార్లగడ్డ శివరామ్ ప్రసాద్

**హాండ్స్** అప్ అని గట్టిగా ఎవరో అరవటంతో నిద్రపోతున్న నేను ఉలిక్కిపడి లేచాను. నల్లబూటు, నల్లసూటు, నల్ల కళ్ళద్దాలు, పెట్టుకుని నల్ల ఫిస్టలు పట్టుకున్న ఆజానుబాహుడిని చూడగానే నా నిద్ర అంతా వదిలిపోయింది. నేను ఎక్కిన విమానంను టెర్రరిస్టులు హైజాక్ చేస్తున్నారని అర్థమైంది. నా తోటి ప్రయాణికులు అందరూ ప్రాణాలని అరచేతిలో పెట్టుకుని ఏ మతం వారు ఆ మతం దేవుడిని ప్రార్థించుకుంటున్నారు. ఒక వృద్ధుడికి ఇది అంతా చూడటంతో గుండె నొప్పి వచ్చి గట్టిగా అరిచాడు. అప్పుడు టెర్రరిస్టుతో సహా అందరూ అటువైపు దృష్టి సారించారు. అదే అదనుగా భావించిన నేను ఒక ఉదుటున మీదకు దూకుదామనుకున్నాను.

'టైమ్ ఎనిమిది అవుతుంది. త్వరగా నిద్ర లేవండి' అని నా భార్య లేపటంతో నిద్రలేచాను. ఇప్పటి వరకు నేను కన్నది ఒక కల అని తెలిసేటప్పటికి గట్టిగా నవ్వు వచ్చి బిగ్గరగా నవ్వాను. "ఉదయాన్నే ఆ నవ్వు ఏమిటండి" అని నా భార్య కాఫీ కప్పు అందిస్తూ అడిగింది. విమానం ఎక్కటమే కాదు, దానిని దగ్గరగా అయినా చూసిన పాపాన పోని, నాకు, "విమానంలో నేను చేసిన సాహసఘట్టం" చెప్పటం ఇష్టంలేక ఏమి మాట్లాడకుండా మంచం దిగి తిన్నగా బాత్రూమ్ వెళ్ళాను. స్నానం చేసి వచ్చిన నాకు హేంగర్‌కు పెట్టిన నా బట్టలు కనిపించకపోవటంతో నా భార్యను పిలిచి అడిగాను. చాకలికి వేసాను అని చెప్పటంతో ప్యాంటులోని పర్సు గుర్తుకు వచ్చి పర్సు వెతకగా, పర్సు ప్యాంటుతోపాటు చాకలి వద్దకు వెళ్ళిపోయింది అని అర్థమై ఎన్నో సంవత్సరాలుగా నా బీరువాలో ఉన్న నా పాత పర్సు తీసుకున్నాను. నా భార్య పర్సు ప్యాంట్‌తో పాటు చాకలికి వేసిందన్న కోపంతో టిఫిన్ తినకుండా ఆఫీసుకు వెళ్ళిపోయాను. ఆఫీసుకు వెళుతున్న నాకు ఆకలి వేయటంతో ఎదురుగా కనబడిన కాఫీ హోటల్‌కు వెళ్ళాను. ఒక దశకు టోకెన్ ఇవ్వమని 'డబ్బు కోసం పర్సు తీయగా దానిలో ఒక మూల ఒదిగిన ఒక చిన్న ఉత్తరం కనిబడింది.

** ** ** ** **

అవి నేను కాలేజీలో చదువుతున్న రోజులు. అందర్నీ ఏడిపిస్తూ, నవ్వుతూ, సరదాగా గడిచి పోయేది. "ఈ సంవత్సరం కొత్త స్టూడెంట్స్ కొంతమంది చేరారురా! శివా" అని నా స్నేహితులు వెంకటేష్, రమేష్, మహేష్ చెప్పారు. మధ్యాహ్నం కేంటీన్‌లో ర్యాగింగ్ చేద్దాం అనుకుని క్లాస్‌కి వెళ్ళాం. ఎప్పటిలాగా మా స్నేహితులంతా వెళ్ళేసరికి క్లాసు ప్రారంభమైంది. "మే ఐ కమ్ ఇన్ సర్" అని వేము అడగటంతో మా వైపు గుర్రుగా చూస్తూ లోపలకు రమ్మనట్లుగా సైగ చేసారు... మాస్టారు. వెనుక బెంచీలు ఖాళీగా వుండటంతో వెళ్ళి అక్కడ కూర్చున్నాం. పాఠం వినకుండా కొత్తగా విడుదలైన సినిమాలు గురించి చర్చించుకుంటున్న మమ్మల్ని మాస్టారు లేపి, "సినిమా హాలులో వెనకా, క్లాసులో ముందూ కూర్చోవాలి" అని మందలించారు. పాఠం చెప్పటానికి బోర్డు వైపు తిరిగారు. వెంటనే నేను "సర్కస్‌లో కూడా ముందే కూర్చుంటాం" అని చెప్పగానే ఆయన్ని సర్కస్ బఫూన్ చేసామని అర్థం చేసుకుని ఏమి విననట్లుగా పాఠం చెప్పటం ప్రారంభించారు.

కాలేజీలో ఎంత అల్లరి చేసినా, మేము బాగా చదువుతాం. అందుచేత ఏ మాస్టారు మమ్మల్ని శిక్షించేవారు కారు. మధ్యాహ్నం టీ తాగటానికి కేంటీన్‌కు వెళ్ళిన మాకు ఒక కొత్త మొహం తారసపడింది. మేం వాడిని పిలిచి, "తేరా నామ్ క్యా హై" అని అడిగాం. దానికి వాడు వాడి పేరు మణికంఠన్ అని, మద్రాసు నుంచి వచ్చాను అని చెప్పాడు. కొత్తగా చేరిన తమిళవాడిని ర్యాగింగ్ చేద్దాం అని, చేయి జారినట్లు నటిస్తూ వాడి మీద టీ పోసాం. కడుక్కోవటానికి లేడీస్ బాత్రూమ్ చూపించి అక్కడి నుంచి వెళ్ళిపోయాం. పావు గంట తరువాత చూస్తే వాడు ప్రిన్సిపల్ ఆఫీసు వద్ద నుంచుని ఉన్నాడు. బాత్రూమ్ వద్ద ఏమి జరిగి వుంటుందో ఊహించిన మేము వెంటనే అక్కడి నుండి జారుకున్నాం.

ఆరోజు గురువారం అవటంతో సాయిబాబా గుడికి వెళ్ళాను. కళ్ళు మూసుకుని దేవుడికి నమస్కారం చేస్తుండగా, జనం రద్దీలో ఒక అందమైన మొహం కనబడింది. దేవుడి గుడిలో ప్రార్థన తప్ప మరి ఏమి ఉండకూడదన్న ఉద్దేశ్యంతో దేవుడికి భక్తితో నమస్కరించి తరువాత ఆమె కోసం వెదికినా నా కళ్ళు అలసిపోయాయి. కాని ఆమె ఎక్కడా కనపడలేదు. రూమ్‌కి వెళ్లినా నేను ఆమె అప్సరస వలే ఉందని చెప్పాను. దానికి రమేశ్ "నువ్వు ఎప్పుడైనా అప్సరసన చూసావా? ఆమెను అప్సరసతో పోలుస్తున్నావు" అని అడిగాడు. దానికి వెంకటేశ్, "మహేష్ ప్రేమిస్తున్న ఆలాపన మహేష్‌కు ఎంత అందంగా కనిపిస్తుందో, ఈ అమ్మాయి కూడా శివకు అంతే అందంగా కనిపిస్తుంది" అని అన్నాడు. దానికి ఉడుక్కున్న మహేష్ "నాకు ఆలాపనే కాదు, వెంకటేష్‌కు వెంకటలక్ష్మి, రమేష్‌కు భారతి కూడా అంతే అందంగా కనిపిస్తారు" అని అన్నాడు.

తరువాత రోజు క్లాసుకి వెళ్ళి పాఠం వింటూ అమ్మాయిలను కొట్టటానికి రాకెట్లు తయారు చేసాం. ఒక రాకెట్టును ఒక అమ్మాయికు గూరి చూసి కొట్టాను. కాని అది నేను కొడదామనుకున్న చోటు కంటే ఒక బెత్తెడు కింద తగిలింది. ఆమె ఒక్కసారి ఉల్కిపడి వెనక్కి తిరిగి చూసింది. అంతే ఆశ్చర్యం...

అదే ముఖం, అదే అప్సరస. ఈసారి ఆమె ముఖం దగ్గర నుండి చూడడంతో ఆమెను బాగా గమనించాను. కలువరేఖల వంటి కళ్ళు, పదునైన ముక్కు, వాటి కింద దొండపండు వంటి పెదాలు. వాటికి ముత్యాలు వంటి పళ్లు. వాటి కింద శంఖం లాంటి మెడ. వాని కింద... 'పే ఎటెన్షన్ శివరామ్' అని సార్ అనటంతో కొంచెం సిగ్గుపడి నా కళ్ళను బలవంతంగా ఆమె వైపు నుంచి బోర్డు మీదకు మరలించాను. బ్రేక్‌లో బయటకు వచ్చిన మాకు, ఒక వింత అనుభవం ఎదురైంది. ఎప్పుడూ ఆడవారిని దారిలో అడ్డగించే మమ్మల్ని ఆ రోజు ఆడపిల్లలు దారి కాచి ఆటకాయించారు. కాలేజీలో జరిగిన ఆ పరాభవంకు తల తీసినట్లున్నా, ఆ అమ్మాయిలలో నా అప్సరస ఉండేటప్పటికి నా మనసులో ఆనందం వెల్లివిరిసింది. అవి నా అప్సరస నాతో పలికిన తొలి పలుకులు. "నువ్వు ఈ కాలేజీ హీరో అని విన్నాను. అమ్మాయిలను ఏడిపించటం హీరోయిజం కాదు. చదువు ఉంటే సరిపోదు. దానికి సంస్కారం కూడా కావాలి.

ర్యాగింగ్ చేయటం మాకు తెలుసు. ఇప్పటి వరకు నువ్వు ఏడిపించావు ఈ రోజు నుంచి మేము నిన్ను ఏడిపిస్తాం' అని చెప్పి నేను మాట్లాడే ముందు అక్కడి నుండి మాయమైపోయింది.

మధ్యాహ్నం మూడు గంటలకు కేంటీన్‌లో టీ తాగుతున్న మాకు పరిగెత్తుకుంటూ వస్తున్న వెంకటేష్ కనిపించాడు. వాడు మాతో, "ఈ విక్టరీ హీరో చేసిన పని తప్పక విక్టరీ సాధించి పెడుతుంది" అని చెప్పారు. అసలు ఏమయింది. వివరంగా చెప్పమనగా వాడు, నా అప్సరస గురించి చెప్పాను. ఆమె పేరు ఆలేఖ్య అని వాళ్ళ నాన్నకు ట్రాన్స్‌ఫర్ అవడంతో ఈ ఊరు వచ్చి ఈ కాలేజీలో చేరిందని, చాలా చలాకీగా ఉంటుందని చెప్పాడు.

ఉదయం కాలేజీకి వెళ్ళటంతో మొదలైంది మా ర్యాగింగ్ ప్రహసనం. ప్రతిరోజు లాగే ఆ రోజు సరదాగా ఏడిపించటానికి మా తమిళ మణికంఠన్‌ని పిలిచాం. వాడు మమ్మల్ని చూసి ముసి ముసి నవ్వులు నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఏమయిందో అని క్లాసుకు వెళ్ళేటప్పటికి, మా మాష్టారు మమ్మల్ని లోపలికి ఆహ్వానిస్తూ ఇది ఏమిటి అన్నట్లు బోర్డు వైపు చూపించారు. బోర్డు మీద కోతిబొమ్మ. దాని పక్కన మాష్టారి పేరు. వాటి క్రింద "ఆర్ట్ బై శివ' అని వ్రాసి వుంది. క్లాసులోని ఆడపిల్లలందరూ లేచి 'సార్ శి మంచి ఆర్టిస్ సార్' అని ముక్తకంఠంతో అన్నారు. ఇది అంతా ఎవరు చేసారో ఊహించిన నేను, కోపంతో క్లాసు నుండి బయటకు వెళ్లిపోయాను.

సాయంత్రం కాలేజీ అయిపోయిన తరువాత నేను, ఆలేఖ్య వద్దకు వెళ్ళి ఒక ప్యాకెట్ ఇచ్చి "నాకు నీతో గొడవ పడటం ఇష్టం లేదు. ఇక నుంచి నీకు ఇష్టం అయితే నీతో స్నేహంగా ఉంటాను" అని చెప్పి ఓటమిని అంగీకరించిన వాడి వలే అక్కడి నుండి వెళ్ళిపోయాను. అర గంట తరువాత మహేష్ వచ్చి చెప్పాడు. "శివ! మనం అనుకునట్లే జరిగింది. మనం ఇచ్చిన ప్యాకెట్‌లోని తేలు ఆలేఖ్యను కరిచింది. ఆలేఖ్య ఇప్పుడు హాస్పటల్‌లో వుంది" అని చెప్పాడు. అది విన్న రమేష్, "మనం సరదాగా చేసిన పని, ప్రాణాల మీదకు తెచ్చింది ఒక్కసారి హాస్పటల్‌కు వెళ్ళి సారీ చెబుదాం" అని చెప్పి నన్ను బలవంతంగా తీసుకు వెళ్ళాడు. హాస్పటల్‌లో ఆమెను చూడటానికి ముఖం చెల్లక బయటే ఉండిపోయాను.

ఆ రోజు నుండి వారం రోజులు ఆలేఖ్య కాలేజీకి రాలేదు. నేను అప్పటి నుండి ఎవ్వర్నీ ఏడిపించలేదు. వారం రోజుల తరువాత ఆలేఖ్య కాలేజీకి వచ్చింది. నేను ఆమెను చూడటంతో సిగ్గుపడి ఆమెకు ముఖం చాటేసాను. ఆ సాయంత్రం నాతో మాట్లాడటానికి ఆలేఖ్య కేంటీన్‌కు వచ్చింది. రమేష్, మహేష్, వెంకటేష్ ముగ్గురూ వంకలు చెప్పి నన్ను ఒక్కడినే అక్కడ వదిలి వారు వెళ్ళిపోయారు. ఆలేఖ్య నావైపు నవ్వుతూ అడిగింది, "నాతో స్నేహం చేస్తానని చెప్పి, నేను హాస్పటల్‌లో వుంటే నన్ను చూడటానికి ఎందుకు రాలేదు?" నేను ఏమీ మాట్లాడలేదు. "నువ్వు నాకు ప్రేమగా పెంచుకోమని ఇచ్చిన తేలు నన్ను ప్రేమగా ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది" అని అంది. నేను ఆ మాటలకు సిగ్గుపడి, "నేను సరదాగా చేస్తే అది సీరియస్‌గా అయిపోయింది సారీ" అని చెప్పి ఇద్దరం ఆ రోజు నుండి స్నేహంగా ఉందాం అని నిర్ణయించుకున్నాం.

తరువాత రోజు కాలేజీలో సరదాగా, నవ్వుతూ మాట్లాడుకుంటున్న మాఇద్దర్నీ చూసి అందరూ ముక్కున వేలు వేసుకున్నారు. అలా ఆమెతో మాట్లాడటం అలవాటు అయిపోయింది. ఆమెతో మాట్లాడకపోతయే ఏదో వెలితిగా అనిపించేది. నాకు తెలియకుండా నేను ఆమెను ప్రేమించడం ప్రారంభించాను. నేను రోజు ఆమెకు ఏదో ఒక పజిల్ ఇచ్చి ఒక చాక్లెట పందెంగా పెట్టేవాడిని. ఆమె రోజూ "చాక్లెట్ నిజంగా ఇస్తావా? ప్రామిస్" అని చేయి ముందుకు పెట్టేది. కాని నేను ఆమెను చేతితో తాకకుండా, పెన్నుతో తాకి "ప్రామిస్" అనే వాడిని. ఆమెను అలా తాకటం వెనక ఒక కారణం ఉంది. ఆమెకు నామీద మంచి అభిప్రాయం కలగాలని, అమ్మాయిలను తాకడం, మంచివాడు అనుకోవాలని అలా చేసేవాడిని. సంవత్సరం గిరుక్కున తిరిగిపోయింది.

ఫేర్‌వెల్ పార్టీకి ఇంకా వారం రోజులు ఉండగా, అందరికీ చాలా బాధ అనిపించింది. నా స్నేహితులందరూ నన్ను ఆమెకు నా ప్రేమను తెలియజేయమని ప్రోత్సహించారు. ఆమెతో ఎదురుగా చెప్పే ధైర్యం లేక ఒక ప్రేమలేఖ వ్రాసాను.

ప్రియమైన ఆలేఖ్య,
ముద్దమందారం వంటి నీ ముఖములో
కలువ రేకులు వంటి కళ్ళలో
దొండపండు వంటి పెదవులతో
నవ్వితే ముత్యాలు రాలేటువంటి
నీ ముఖ సౌందర్యం చూచి
నాకు మాటరాక, నిన్ను మరువ లేక,
నీకు చెప్పలేక, ఈ ఎడబాటులో ఉండలేక
క్షణం ఒక యుగంలాఆ నిన్ను తలచుకుంటూ
ఎలా చెప్పాలో, ఎప్పుడు చెప్పాలో అర్థంకాక
నా నమసులోని బాధ దిగమ్రింగుకోలేక
నిన్ను కలవాలని, ఏదో చెప్పాలని,
ప్రతిరోజు ఎదురు చూస్తున్నాను.
ఆ కలయిక ఎప్పడ . నేది చెబుతావు కదూ
ప్రస్తుత నేస్తమా, రేపటి ప్రియతమా
నా స్థానంలో నీవుండి ఆలోచించి
నా మనసులో బాధని మరిపించు
ఆలోచించు చూడు.

ఫేర్‌వెల్ రోజున ఆమెకు ఇవ్వాలని ప్రేమలేఖని జాగ్రత్తగా నా పర్సులో పదిల పరిచాను. ఫేర్‌వెల్ రోజున అందరి హృదయాలు బాధతో నిండిపోయాయి. ఇన్ని సంవత్సరాలుగా సరదాగా కలిసి చదువుకున్న స్నేహితులందరూ విడిపోయే ఆఖరి క్షణాలు. తెల్లవారితే ఒక్కొక్కరూ ఒక్కొక్క ఊరు వెళ్ళిపోతారు అన్న సంగతి గుర్తుకు తెచ్చుకుంటేనే ఒళ్ళు జలదరించిపోయేది.

అటువంటి ఆ ఆఖరి క్షణంలో కూడ మొహమాట పడితే జీవితంలో చాలా కోల్పోవలసి వస్తుంది అని తలచి ఆమెకు ఇవ్వటానికి ఆమె వద్దకు వెళ్ళాను. ఆమె నాతో బరువెక్కిన గుండెతో మెల్లగా చెప్పింది. "ఈ కాలేజీలో నాకు మంచి చదువుతోపాటు మంచి స్నేహితుడవు నీవు దొరికావు. రేపు నాకు నిశ్చితార్థం. నీవు నా పెళ్ళికి మన స్నేహితులందర్నీ తీసుకురావాలి. నా కళ్ళు నీళ్ళతో, హృదయం బాధతో బరువెక్కాయి. నన్ను నిజంగా పిలుస్తున్నావా "ప్రామిస్" అని చేయి ముందుక చాపాను. ఆమె పెన్నును నా చేయి మీద పెట్టి ప్రామిస్ అంది.

నేను ఆమెను తాకుదామని, ఆమె చేయి అందుకుందామనుకున్న సమయానికి ఆమె చేయి నా చేయి దాటిపోయింది. ఆమెకు ఇద్దామనుకున్న ప్రేమలేఖ నా పర్సులనే ఉండిపోయింది..... ఇప్పటివరకు.